సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం

ఎమ్మెల్యే వివేకానంద్‌గౌడ్



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్‌గౌడ్

కుత్బుల్లాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎంతో మంది నిరుపేదలు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని పొందుతున్నారని ఎమ్మెల్యే వివేకానంద్‌గౌడ్ అన్నారు. చింతల్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో 114 మందికి రూ.45 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ గౌరీష్, నిజాంపేట్ కార్పొరేటర్ గాజుల సుజాత, మాజీ కౌన్సిలర్ సూర్యప్రభ, నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, ఎర్వ శంకరయ్య, భాస్కర్, శ్రీకాంత్, సీనియర్ నాయకులు కస్తూరి బాల్‌రాజ్, కమలాకర్, శ్రీనివాస్ యాదవ్, ఇబ్రహీం, బలరాం, యేసు తదితరులు పాల్గొన్నారు

- రాష్ట్ర ప్రభుత్వం డీజేలపై నిషేధం విధించడంతో మైఫ్రెండ్స్ సౌండ్ అండ్ లైటింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి రాజశేఖర్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిశారు. తమ గోడును వెల్లబోసుకున్నారు. డీసీపీతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



శంభీపూర్ రాజును సత్కరిస్తున్న సంక్షేమ సంఘం నేతలు

దుండిగల్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, వివిధ సంఘాల సభ్యులు తన కార్యాలయంలో కలిసి సమస్యలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా దుర్గా దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు, అన్నదాన కార్యక్రమాలకు హాజరు కావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు.

ఐకమత్యంతో సమస్యలు పరిష్కరించుకోవాలి



కూన శ్రీశైలంగౌడ్‌ను కలిసిన సంజయ్‌గాంధీ నగర్ నూతన కమిటీ సభ్యులు

కుత్బుల్లాపూర్: సంక్షేమ సంఘాలు ఐకమత్యంగా ఉండి స్థానిక సమస్యలను పరిష్కరించుకోవాలని, తద్వారా బస్తీలు అభివృద్ధి చెందుతాయని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సంజయ్ గాంధీ నగర్ (గుబురు గుట్ట) కాలనీ అసోసియేషన్ ఎన్నికల్లో విజయం సాధించిన సభ్యులు సోమవారం కూన శ్రీశైలంగౌడ్‌ను షాపూర్ నగర్‌లోని ఆయన నివాసంలో కలిశారు. అధ్యక్షుడిగా ఎన్నికైన బండారు నారాయణతో పాటు ఇతర సభ్యులను శ్రీశైలం గౌడ్ అభినందించారు. బస్తీల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రమేష్, రాజు, పరమేష్, గంగా, వెంకటేష్, కిరణ్, రాజేష్, సోహెల్, సుధీర్, మహేష్ యాదవ్, చిన్న, దుర్గేష్, కిరణ్, శ్రీకాంత్, బాలు, అబ్రహం, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా రోడ్డు.. తొలగించిన అధికారులు



దుండిగల్: ఓ నిర్మాణ సంస్థ తన వెంచర్‌కు వెళ్లేందుకు ప్రభుత్వ స్థలంలో రోడ్డును నిర్మించింది. దీనిపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో గండిమైసమ్మ-దుండిగల్ మండల రెవెన్యూ అధికారులు సదరు రోడ్డును తొలగించారు. వివరాల్లోకి వెళితే.. డి.పోచంపల్లి సర్వే నెంబరు 200, 201/లో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. ఇదే స్థలాన్ని గతంలో ప్రభుత్వం శ్మశాన వాటికకు కేటాయించింది. దీనిపై పక్కనే త్రిపుర ల్యాండ్ మార్క్ సంస్థ నిర్మాణాలను చేపడుతుంది. నిర్మాణ సంస్థకు అప్రోచ్ రోడ్డు లేకపోవడంతో ప్రభుత్వ స్థలం నుంచే 40 ఫీట్ల రోడ్డును నిర్మించారు. దీనిపై స్థానికులు ఆందోళన చేపట్టడంతో సోమవారం తహసీల్దార్ సయ్యద్ మతీన్ తన సిబ్బందితో కలిసి రోడ్డును పూర్తిగా తొలగించారు.

ముగిసిన ఫారెస్ట్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్



సుభాష్‌నగర్: రెండు రోజుల పాటు జరిగిన 7వ తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ సోమవారం ముగిసింది. బాసర, భద్రాద్రి, చార్మినార్, కాళేశ్వరం, యాదాద్రి, రాజన్న జోగులాంబ గద్వాల్ సర్కిళ్లకు చెందిన 815 మంది అటవీ అధికారులు పలు పోటీల్లో పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి హాజరైన పీసీసీఎఫ్ ఏలుసింగ్ మేరు ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ నెల 16న రాయపూర్‌లో జరిగే జాతీయ అటవీ అధికారుల క్రీడాపోటీల్లో ప్రతిభ కనబర్చిన అధికారులు పాల్గొంటారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్లు, జిల్లా అటవీ అధికారులు, డివిజనల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ పార్కింగ్

- తప్పని ట్రాఫిక్ తిప్పలు
- పట్టించుకోని అధికారులు
- నో పార్కింగ్ బోర్డు ఉన్నా బేఖాతర్

ప్రధాన రహదారులపై అక్రమ పార్కింగ్ యథేచ్ఛగా కొనసాగుతుంది. నో పార్కింగ్ బోర్డు వద్ద కూడా వాహనాల పార్కింగ్ కొనసాగుతున్నా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దుకాణాలు, షాపింగ్‌మాల్స్ వద్ద రోడ్లవెంట వాహన పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

–రంగారెడ్డినగర్



ఓ షాపింగ్ కాంప్లెక్స్ ముందు నో పార్కింగ్ బోర్డు పక్కనే ఇలా..

కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ప్రధాన రోడ్లపై వాహనాల పార్కింగ్ రోజు రోజుకు పెరుగుతోంది. వాహనాల రాకపోకలు సజావుగా కొసాగేందుకు కోట్లాది నిధులు వెచ్చించి రోడ్ల వెడల్పు చేసినా అక్రమ పార్కింగ్‌తో సమస్య మళ్లీ మొదటికే వస్తోంది. రోడ్ల వెంట అక్రమ పార్కింగ్‌లను అరికట్టడంలో సంబంధిత అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండటంతో పలు దుకాణాలు, షాపింగ్ మాల్స్ ఎదుట పదుల సంఖ్యలో వాహనాలు నిలుపుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధిస్తామని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినా లెక్క చేయడం లేదు. ఐడీపీఎల్ చౌరస్తాను మొదలుకుని జగద్గిరిగుట్టకు వెళ్లే మార్గంలోని గిరినగర్ కల్వర్ట్‌కు అటు, ఇటుగా రోడ్డుపై పలు పరిశ్రమలకు చెందిన వాహనాలను నిలుపుతున్నారు. ఆ ప్రాంతంలో రోడ్డు కుచించుకుపోతోంది. గాంధీనగర్ ఐలా కార్యాలయం ఎదురుగా ఉన్న ఓ వైన్స్ దుకాణం ముందు, భగత్‌సింగ్ విగ్రహం సమీపంలోని ఓ హోటల్ ముందు పదుల సంఖ్యలో వాహనాలు నిలుపుతూ రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నారు.



గాంధీనగర్ ఐలా కార్యాలయం ఎదురుగా ఉన్న వైన్స్ వద్ద..

స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం



త్వరలోనే స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అక్రమ పార్కింగ్‌లను కట్టడి చేస్తాం. షాపింగ్ మాల్స్ ముందు, నో పార్కింగ్ జోన్లలో నిలుపుతున్న వాహనాలను గుర్తించి సదరు యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. వాహనాలను అక్రమంగా పార్కింగ్ చేసి ట్రాఫిక్ అంతరాయం కలిగించే వారిపై చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసులు, బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ



ఐడీపీఎల్- జగద్గిరిగుట్ట రోడ్డులో భగత్‌సింగ్ విగ్రహం సమీపంలో ఓ హోటల్ ఎదుట నిలిపిన వాహనాలు

కాళ్లు, చేతులు కట్టేసి.. కృష్ణానదిలో పడేసి..

- డబ్బులు ఎగ్గొట్టేందుకు హత్య
- ఐదుగురి రిమాండ్



జీడిమెట్ల: తనకు ఇవ్వాల్సిన డబ్బులను అడిగినందుకు ఓ వ్యక్తిని హత్యచేసిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌చార్జి డీసీపీ కోటిరెడ్డి, అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, బాలానగర్ ఏసీపీ హనుమంతారావు, జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్‌తో వివరాలు వెల్లడించారు. ఈస్ట్ సాయినగర్ అల్విన్‌కాలనీకి చెందిన కోయ వెంకటప్పన్నరెడ్డి (54) 2021- 22లో కాకినాడ ఓడరేవు వద్ద చిత్తూరు జిల్లా కల్కారి మండలానికి చెందిన బేతిన ద్వారకానాథ్‌రెడ్డితో కలిసి క్యాటరింగ్ చేస్తుండగా ఇద్దరి మధ్య డబ్బు లావాదేవీల్లో గొడవలు మొదలయ్యాయి. వెంకటప్పన్నరెడ్డికి ద్వారకానాథ్‌రెడ్డి రూ.28 లక్షలు బాకీ పడ్డాడు. ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వకుండా ద్వారకానాథ్ కాకినాడ నుంచి మరో ప్రాంతానికి వెళ్లిపోగా వెంకటప్పన్నరెడ్డి నగరానికి వచ్చి బాలానగర్‌లోని మెగా కంపెనీలో ఏజీఎంగా ఉద్యోగంలో చేరాడు. ఇటీవల ద్వారకానాథ్‌రెడ్డి తిరుపతిలో ఉన్నట్లు తెలుసుకున్న వెంకటప్పన్న అక్కడికెళ్లి డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేయగా చెక్కులు ఇచ్చాడు. ఆ చెక్కులు బౌన్స్ అవ్వడంతో అప్పటి నుంచి తన డబ్బులు ఇవ్వాలని ద్వారకానాథ్‌పై ఒత్తిడి చేయసాగాడు.

రెండు సార్లు నగరానికి వచ్చి..

ఎలాగైన వెంకటప్పన్నను హత్యచేసి డబ్బులు ఎగ్గొట్టాలని ద్వారకానాథ్ నిర్ణయించుకుని తిరుపతి నుంచి కొంతమందిని తీసుకుని ఈ నెల 1న నగరానికి వచ్చాడు. అతడు అనుకున్న ప్లాన్ సక్సెస్ కాకపోవడంతో వెళ్లిపోయాడు. మూడ్రోజుల తర్వాత కడప జిల్లా వెంపల్లికి చెందిన బసిరెడ్డి సుధాకర్‌రెడ్డి (59), పాశం ప్రసాద్ (36), కడప జిల్లా వల్లూరుకు చెందిన బుసుపాటి కిరణ్‌కుమార్ (30), చెన్నూరుకు చెందిన గడ్డం వెంకట సుబ్బయ్య (25), పాత కడపకు చెందిన అన్నిక మణికంఠ (25)తో కలిసి తన మహీంద్రా కారులో (ఏపీ 31డీఏం 8512) వచ్చి 4న మైత్రినగర్‌లో వెంకటప్పన్నరెడ్డిని బలవంతంగా తీసుకెళ్లి క్లోరోఫాం ఇవ్వడంతో స్పృహ కోల్పోయాడు. అనంతరం వెంకటప్పన్నను కొత్తకోటకు తీసుకెళ్లి కాళ్లు, చేతులు కట్టేసి బీచుపల్లి బ్రిడ్జిపై నుంచి కృష్ణానదిలో పడేసి వెళ్లిపోయారు. రాత్రైనా వెంకటప్పన్నరెడ్డి ఇంటికి రాకపోవడంతో భార్య హేమ జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ ఉన్నతాధికారుల సలహాతో ప్రాథమిక ఆధారాలు సేకరించి చాకచక్యంగా నిందితులను పట్టుకుని విచారించగా.. వెంకటప్పన్నను కృష్ణానదిలో పడేసినట్లు ఒప్పుకున్నారు. పోలీసులు గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహం కోసం వెతకగా బూడిదపాడు వద్ద లభ్యమైంది. ద్వారకానాథ్ రెడ్డి పరారీలో ఉండగా మిగతా ఐదుగురిని సోమవారం రిమాండ్‌కు తరలించారు.



ఎన్‌సీఎల్ నార్త్ కాలనీలో శ్రీదుర్గాసేవా మండపంలో పూజలు



నిజాంపేట్ రాజీవ్‌గాంధీ నగర్‌లో పూజల్లో పాల్గొన్న కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి



పేట్‌బషీరాబాద్ కట్టమైసమ్మ ఆలయంలో చండీ హోమంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా శరన్నవరాత్రోత్సవాలు

కుత్బుల్లాపూర్: దేవి శరన్నవరాత్రోత్సవాలు నియోకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవార్ల ఆలయాలు, మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవార్లు శ్రీమహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పలు చోట్ల అసోసియేషన్ల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.



దుండిగల్‌లోని శ్రీగణపతి సచ్చిదానం ఆశ్రమంలో మహాలక్ష్మిగా అమ్మవారు



గాంధీనగర్ కల్చరల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం



దూలపల్లిలో మహాలక్ష్మి అవతారంలో..

మహానగర అభివృద్ధిపై నిర్లక్ష్యం తగదు

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: మహానగర అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సోమవారం షాపూర్‌నగర్ చౌరస్తాలో నిర్మించిన పాదచారుల వంతెనను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రధాన కూడళ్ల వద్ద పాదచారులు రోడ్డు దాటేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 54 చోట్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించామని తెలిపారు. కానీ ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కూల్చడమే తప్ప కొత్త అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం లేదని ఎద్దేవా చేశారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూలుస్తున్నారని, మూసీ నిర్వాసితులకు సరైన ప్రత్యామ్నాయం చూపకుండా తరలించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో సూరారం డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు జీడిమెట్ల సోమేశ్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

కుత్బుల్లాపూర్: సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ఉప కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి అన్నారు. సోమవారం గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల కార్యాలయాల్లో ప్రజావాణికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కుత్బుల్లాపూర్ సర్కిల్‌కు సంబంధించి టాక్స్ సెక్షన్(02), హెల్త్ అండ్ శానిటేషన్ (1), ఎలక్ట్రికల్ (2), టౌన్ ప్లానింగ్ (2), ఇంజినీరింగ్ (01) మొత్తం 8 ఫిర్యాదులు రాగా, గాజులరామారం సర్కిల్ పరిధిలో ఇంజినీరింగ్ (5), టౌన్ ప్లానింగ్ (1), ఎలక్ట్రికల్ (01) మొత్తం 7 ఫిర్యాదులు వచ్చాయి. వారిని పరిశీలించిన ఉప కమిషనర్లు తగు పరిష్కార మార్గాలు చూపాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు.

ముమ్మరంగా బీజేపీ సభ్యత్వ నమోదు

సుభాష్‌నగర్: రానున్న రోజుల్లో గ్రేటర్ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకుంటుందని ఆ పార్టీ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. సూరారం డివిజన్ సంజయ్ గాంధీ నగర్‌లో సోమవారం సభ్యత్వ నమోదును నిర్వహించారు. గడచిన 15 రోజుల వ్యవధిలో ఇప్పటికి నియోజకవర్గంలో 20 వేల సభ్యత్వాలు పూర్తి చేశామని తెలిపారు.

కొనుగోలుదారులకు న్యాయం చేయాలి



నిజాంపేట్: చెరువు బఫర్ జోన్‌లో నిర్మించిన నిర్మాణాలను కూల్చివేయాలని, కొనుగోలుదారులకు మాత్రం న్యాయం చేయాలని నిజాంపేట్ బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో చెరువు ఆక్రమణలపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాచుపల్లిలోని కోమటి కుంటలో వాసవీ కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యం 8, 9 బ్లాక్‌లను నిర్మించిందని, అయితే చెరువు బఫర్ జోన్ స్థలాన్ని బదిలీ చేస్తూ గతంలో ఇరిగేషన్ శాఖ ఈఈ కలెక్టర్‌కు లేటర్ రాయడాన్ని ఆయన తప్పు బట్టారు. ఈ క్రమంలో హైడ్రా అధికారులు కూల్చకుండా సదరు కన్‌స్ట్రక్షన్ యాజమాన్యం కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకుందని, ఈ విషయమై కలెక్టర్ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసి కోమటి చెరువులో చేపట్టిన నిర్మాణాలను కూల్చివేయాలన్నారు. అదేవిధంగా కుత్బుల్లాపూర్ పరిధిలో సర్వే నెంబర్ 58 నుంచి 226 వరకు సరైన సమాచారం లేకుండా వక్ఫ్ బోర్డు భూములు అంటూ కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం తగదన్నారు. తక్షణమే ఈ నిషేధాన్ని ఎత్తివేసి రిజిస్ట్రేషన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అరుణ్‌రావు, ఎల్ల స్వామి, ముఖేష్ పాల్గొన్నారు.

బోధన, బోధనేతర సిబ్బందికి సన్మానం

నిజాంపేట్: వీఎన్ఆర్ వీజేఐఈటీ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కళాశాల ఆవరణలో బోధన, బోధనేతర సిబ్బందిని సత్కరించారు. మొత్తం 32 మంది సిబ్బందిని సత్కరించి మెమోంటోలను అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రెసిడెంట్ జగదీశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సీఆర్ నాయుడు, డైరెక్టర్ చెన్నకేశవరావు, పూర్వ విద్యార్థుల ప్రతినిధులు కృష్ణ, సుధీర్, నరేష్, వసుంధర, రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.





నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. మేయర్ నీలారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్పొరేటర్లు లక్ష్మీకుమారి, సుజాత, ఆయా విభాగాల మహిళా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

– నిజాంపేట్

మేయర్‌కు ఆహ్వానం అందజేత

నిజాంపేట్: ప్రగతినగర్ గోశాల మిత్ర మండల్ సభ్యులు సోమవారం నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా నిర్వహించే దాండియా వేడుకలకు రావాల్సిందిగా కోరుతూ మేయర్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు.



మేయర్ నీలారెడ్డిని దాండియా వేడుకలకు ఆహ్వానిస్తున్న ప్రగతినగర్ గోశాల మిత్రమండల్ సభ్యులు

మెరుగైన వసతులు కల్పిస్తాం

చింతల్: ప్రజలకు మెరుగైన సదుపాయాలను కల్పించే విధంగా కృషి చేస్తున్నామని కార్పొరేటర్ రషీదాబేగం అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్ నగర్‌లో రూ.62 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోడ్డు నెంబరు 54 నుంచి 57 వరకు రోడ్లు వేసేందుకు రూ.17 లక్షల ప్రతిపాదనలు పంపిచామని, రెండు నెలల్లో రోడ్డు పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ నాగరాజు, సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనాథ్, నాయకులు సాంబయ్య, భూమయ్య, సామ్రాట్, శ్రీధర్, పంగ రాజు పాల్గొన్నారు.